క్లుప్తంగా

అభివృద్ధే మా లక్ష్యం

సత్తుపల్లి: అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గురువారం సత్తుపల్లి మండలం గౌరిగూడెంలో రూ.29 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. సింగరేణి ఉద్యోగుల ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి కార్యాలయంలో ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, జూనియర్ సివిల్‌జడ్జి ఎస్‌కె అయేషాసరీనా, మాజీ సర్పంచ్ ముత్తారెడ్డి, నర్సింహారావు, ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావు, సింగరేణి జీఎం షాలేంరాజు, లేడీస్‌క్లబ్ అధ్యక్షురాలు మధురవాణి షాలేంరాజు, పీఓ ఎస్.వెంకటాచారి, ఇందిరాదేవి, భవాని, దుర్గా, భాషా పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం..

పెనుబల్లి: మండలంలోని చౌడవరం అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఛత్తీస్‌గఢ్ ఆదివాసీల తాగునీటి సమస్యను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పరిష్కరించారు. గురువారం అధికారులు సోలార్ విద్యుత్ ద్వారా మోటార్ ఏర్పాటు చేయించి తాగునీటిని అందించారు.

తాత్కాలిక రోడ్డు నిర్మాణం

వైరా: వైరా నుంచి స్నానాల లక్ష్మీపురం వెళ్లేందుకు యుద్ధప్రతిపాదికన కొంత దూరం తాత్కాలిక రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. శివరాత్రికి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అధికారులతో కలిసి తాత్కాలిక రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం క్షేత్రస్థాయిలో భూములు పరిశీలించారు. గండగలపాడు గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ భూములను రోడ్డు నిర్మాణానికి ఇచ్చేందుకు ముందుకు రావడంతో.. రోడ్డు ఏర్పాటు చేశారు.

జాతర ఏర్పాట్లు పూర్తి..

వైరారూరల్: మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జాతర ఏర్పాటను గురువారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పరిశీలించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఆలయ వార్షికోత్సవం

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలోని సాయిబాబా ఆలయ 16వ వార్షికోత్సవాన్ని గురువారం ఆలయ అర్చకుడు మందా సాయి వెంకటశ్రీధర్, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో తెల్లవారుజాము నుంచే అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

లైబ్రరీకి పుస్తకాలు వితరణ

మధిర: మధిర గ్రంథాలయానికి హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఆర్.శివరామకృష్ణప్రసాద్ సుమారు రూ.3లక్షల విలువచేసే విలువైన పుస్తకాలను వితరణగా అందజేశారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

కల్లూరు: కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలవిద్యార్థులకు తోపుడుబండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.15 వేల విలువైన పరీక్ష ప్యాడ్లు, జామెంటరీ బాక్స్‌లు, రెండు పెన్నులు చొప్పున తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకుడు ఎస్‌కే సాధిక్ అలీ అందించారు.

మహిళా సారథులు..

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



6వ అదనపు జిల్లాజడ్జి వెంపటి అపర్ణ | సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి | జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె అయేషాసరీనా | అదనపు జూనియర్ సివిల్ జడ్జి లావణ్య | సీడీపీఓ ఎ.కొండమ్మ



ఎఫ్‌డీఓ మంజుల | ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి | మెప్మా టీఎంసీ సుజాత | ఆర్టీసీ ఏఎం విజయశ్రీ | ఆర్టీసీ ఎంఎఫ్ సాహితి

రేపటికి ముందడుగు

సత్తుపల్లిటౌన్: తరతరాలుగా మహిళలపై జరుగుతున్న వివక్షతకు.. అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేసి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ మహారాణులుగా నిలుస్తున్నారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన సత్తుపల్లిలో ప్రధాన శాఖలను మహిళా అధికారులే ముందుండి నడిపిస్తున్నారు. ఆయా శాఖల్లో రాణిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

కీలకంగా వ్యవహరిస్తూ..

అనేక కీలక శాఖల్లో మహిళా అధికారులే ముఖ్య భూమిక పోషిస్తున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవడం.. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడంతో పాటు పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవటం మహిళా అధికారులదే కీలక పాత్ర.

న్యాయశాఖలో..

సత్తుపల్లిలోని 6వ అదనపు జిల్లా జడ్జిగా వెంపటి అపర్ణ, సీనియర్ సివిల్‌జడ్జిగా పి.అరుణకుమారి, జూనియర్ సివిల్ జడ్జిగా ఎస్‌కె అయేషాసరీన్, అదనపు జూని యర్ సివిల్‌జడ్జిగా లావణ్య న్యాయశాఖలో సేవలు అందిస్తున్నారు.

ఆర్టీసీలో ముగ్గురు బాస్‌లు..

సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్‌గా యు.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్‌గా పి.విజయశ్రీ, ఎంఎఫ్‌గా ఎస్.సాహితి ఆయా విభాగాలకు బాసులుగా ఉన్నారు. వీరితో పాటు మహిళా కండక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు.

అటవీ రక్షణలో..

అటవీశాఖ డివిజనల్ అధికారిగా వాడపల్లి మంజుల, రేంజర్ స్నేహలత, డీఆర్‌ఓలు నసరూబీ, నాగమణిలతో పాటు సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్లు అటవీ రక్షణలో తమదైన పాత్రను పోషిస్తున్నారు.

ఇంకొన్ని శాఖల్లో..

మున్సిపాలిటీలోని 550 స్వయం సహాయక సంఘాల్లోని 5,550 మంది సభ్యులు ఉన్నారు. వీరికి మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాత ఈ సంఘాలను బ్యాంకులతో అనుసంధానం చేసి వారి ఉపాధి పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. అదే విధంగా విద్యుత్‌శాఖలో ఏఈగా సుజాత, సబ్‌ఇంజనీర్ సాగరికలు, రవాణాశాఖ చెక్‌పోస్టు అధికారిగా విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఇంట్రా డీఈఈగా స్వరూపరాణి, ఏఈగా జయలక్ష్మి, వైద్యశాఖలో డాక్టర్ స్రవంతి, విజయలక్ష్మి సేవలు అందిస్తున్నారు. ఐసీడీఎస్‌లో సత్తుపల్లి సీడీపీఓగా ఎ.కొండమ్మ, కల్లూరు సీడీపీఓగా కృష్ణకుమారిలతో పాటు 19 మంది సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మహిళా శిశుసంక్షేమ శాఖలో సేవలు అందిస్తున్నారు.

విరాళాలను బహిర్గతం చేయాలి

మధిర/బోనకల్: బీజేపీ యొక్క ఎలక్టోరల్ బాండ్ పథకం ద్వారా స్వీకరించిన విరాళాలను బహిర్గతపరచాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, గాలి దుర్గారావు తెలిపారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మధిర పట్టణంలోని, బోనకల్ మండలంలోని ఎస్‌బీఐ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నల్లధనం మూలాన్ని దాచిపెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం ఎస్‌బీఐని ఉపయోగించుకుంటుందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను బేకాతర్ చేస్తూ బీజేపీ నియంత పోకడలకు పోతుందని ఆరోపించారు. దాతల గురించిన సమాచారం పబ్లిక్‌గా మారిన తరువాత ఎంపిక చేసిన కార్పొరేటర్లకు తన సంబంధాలను బహిర్గతం చేసే అవకాశం గురుంచి బీజేపీ ఆందోళన చెందుతుందన్నారు. ఈ కార్యక్రమాలల్లో ఎంపీపీ లలిత, మున్సిపల్ కౌన్సిలర్లు ధని కుమార్, వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, వంశీకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, రవికుమార్, జహంగీర్, రామారావు పైడిపల్లి కిశోర్, గుగులోత్ రమేష్, మరీదు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మధిర: ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాలికా సాధికారతపై అవగాహన

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ ప్రణాళికలో భాగంగా బాలికా శిశు సాధికారత క్లబ్ నిర్వహణతో పాటు 6 నుంచి 10వ తరగతి బాలికలకు గురువారం అవగాహన సదస్సు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖ న్యాయవాది దొబ్బల శిరీష అక్షరాస్యత చట్టబద్దత అనే అంశంపై ప్రముఖ మల్టీ పర్పస్ నర్సింగ్ లెక్చరర్ మానస ఆరోగ్యం, పరిశుభ్రత అనే అంశంపై బాలికలకు వివరించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు స్వరూపరాణి, వసంత, మాధవి, పద్మశ్రీ, నాగమణి, మాధవీ లత తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో గర్ల్స్ ఎంపవర్‌మెంట్ క్లబ్ ఏర్పాటు

కారేపల్లి: కారేపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్ నందు గురువారం బాలిక సాధికార సంఘం (గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్)ను ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడిగా ప్రిన్సిపాల్ మహ్మద్ అక్తర్, కన్వీనర్‌గా మహిళ ఉపాధ్యాయురాలు కె.అర్చన, సభ్యులుగా వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, మనిత కుమారి, భానుచంద్రికలు వ్యవహరించనున్నారు. క్లబ్ ప్రారంభ కార్యక్రమంలో కారేపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ టి.శ్రేష్ట కౌమారదశలో బాలికలలో వచ్చే మార్పులు, పరిశుభ్రత, పౌష్టికాహారం గురించి వివరించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని పలువురు వక్తలు అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు పలువురి మహిళలను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లి: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి



ఎర్రుపాలెం: ఐకేపీ కార్యాలయంలో మహిళలను సత్కరిస్తున్న ఏపీఎం శిరీష



బోనకల్: మహిళలను సన్మానిస్తున్న అధికారులు



కారేపల్లి: అధికారులు అందించిన బహుమతులతో మహిళలు

రేషన్‌షాపులపై చర్యలు తీసుకోవాలి

మండల పరిషత్ సమావేశంలో ఎంపీటీసీల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ కిరణ్

కల్లూరురూరల్: మండలంలో పనివేళలు పాటించని రేషన్‌షాపులపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ కొండూరు కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ అధ్యక్షుడు బీరవెల్లి రఘు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు పనివేళలు పాటించకపోవడంతో పేదలకు సరిగా బియ్యం అదండంలేదని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ, తహసీల్దార్లను కోరారు. విద్యుత్ జీరో బిల్లులు రానివారు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని కల్లూరు ఏఈ గణేష్ తెలుపగా.. పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ ప్రసాద్ అన్నారు. కల్లూరు ఎంపీఓ సురేష్‌బాబు మాట్లాడుతూ.. పంచాయతీలలో ఇప్పటివరకు 70 శాతంపైగా ఇంటి పన్నులు వసూళ్లు చేశామనగా.. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. ఈ సమావేశంలో వెటర్నరీ డాక్టర్ మమత, ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ నవ్యకాంత్, చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ నస్రత్‌తబస్సుం, ఏపీడీ పీఓ రత్నమ్మలు తమ శాఖలకు సంబంధించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ పులి సాంబశివుడు, డీటి బాబ్జి ప్రసాద్, ఏఓ రూప, మిషన్ భగీరథ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాళికామాత ఆలయంలో ప్రత్యేక పూజలు

ముదిగొండ: గంధసిరిలో నూతనంగా నిర్మించిన శ్రీ కాళికా మాత దేవాలయంలో గురువారం గురుజీ పస్తం రామరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో మున్నేరు సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన సమ్మక్క, సారక్క, కాళికామాతా ఆలయంలో భక్తులు, గ్రామస్తులు అమ్మవార్లకు పూజలు చేశారు. మేడారం సమక్క – సారక్క మహాజాతర సందర్భంగా ఇక్కడ అమ్మవారిని ప్రతిష్ఠించినట్లు భక్తులకు వివరించారు. కార్యక్రమంలో గురుస్వామి రామరాజు, చిన్నలక్ష్మి, మామిళ్లమ్మ, సాయికుమార్, మస్తాన్‌రాజు, గ్రామస్తులు నాగయ్య, రాఘవరెడ్డి, రామారావు, గోవిందరావు, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పకీరయ్య, శ్రీను పాల్గొన్నారు.



దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సుబాబుల్ కర్ర చెత్త దగ్ధం

ఎర్రుపాలెం: ప్రమాదవ శాత్తు సుబాబుల్ కర్ర చెత్త దగ్ధమైన ఘటన మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ ఫ్లెక్షివర్ సమీపాన గురువారం జరిగింది. ఫ్లైఓవర్ సమీపాన ఉన్న సుబాబుల్ తాట(చెత్త) వలిచే ప్రాంగణంలోకి కొంతదూరం నుంచి వచ్చిన మంటలు వ్యాపించాయి. దీంతో సుబాబుల్ తాటలతో పాటు పరిసర ప్రాంతంలోని చెట్లు కాలిపోగా, మధిర అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు.

జీరో బిల్లులు అందజేతపై హర్షం

మధిరరూరల్: జీరో కరెంట్ బిల్లుతో విద్యుత్ వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తూ గురువారం మాటూరుపేట మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ బీసీ నాయకులు చిలివేరు బుచ్చిరామయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు తలపురెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెంటపల్లి శ్రీనివాసరావు, ధనిశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

మధిర: రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో 2024–2025 సంవత్సరానికి గాను అంచనా ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కావలసిన బడ్జెట్‌పై చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత, కమిషనర్ షఫీ ఉల్లా, మేనేజర్ రవీందర్, ఏఈ నరేష్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్ పాల్గొన్నారు.

నియామకం

తల్లాడ: పెనుబల్లి మండలం నీలాద్రి ఆలయ డైరెక్టర్లుగా గురువారం తల్లాడ మండలానికి చెందిన ఇరువురు నియమితులయ్యారు. తల్లాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల నాగిరెడ్డి, తల్లాడ గౌడ సంఘం నాయకులు బొడ్డు రామలక్ష్మణ్‌లను నీలాద్రి ఆలయం ఈఓ వెంకటరమణ శాలువాలతో సన్మానించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ముదిగొండ: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని యడవల్లి పంచాయతీ శివారు ధనియాలగూడెంకు చెందిన ఆవుల ఉపేందర్(35) బోర్‌వెల్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు పదిహేనేళ్ల క్రితం క్రితం జరగగా, కొంతకాలంగా కుటుంబంలో కలహాలు జరుగుతున్నాయి. దీంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉపేందర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

పెనుబల్లి: మండలంలోని రామచందర్‌రావు బంజర్‌లో ఇటుకల బట్టీ వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడగా డ్రైవర్ మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరుకు చెందిన తమ్మిశెట్టి రమణయ్య (40) రామచందర్‌రావుబంజర్ ఇటుకల బట్టీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మట్టిని ట్రాక్టర్‌తో తొక్కుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడటంతో రమణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు వీఎం బంజర్ ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

అనారోగ్యంతో స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి

వైరారూరల్: మండలంలోని అష్ణగుర్తి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు కంచర్ల మహాలక్ష్మమ్మ (94) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. కాగా మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఐదుగురు కుమారులు ఉండగా వారిలో ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు మృతిచెంది ఉన్నారు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

ప్రమాణ స్వీకారం

చింతకాని: మండలంలోని వందనం, పాతర్లపాడు గ్రామాల్లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాల్లో ఆలయ నూతనల పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వందనం ఆలయ కమిటీ చైర్మన్‌గా ఆవుల అయితంరాజు, పాతర్లపాడు ఆలయ కమిటీ చైర్మన్‌గా తన్నీరు శ్రీనివాసరావు లతో పాటు పాలకవర్గ సభ్యులచే దేవాదాయశాఖ ఖమ్మం డివిజన్ ఇన్స్‌పెక్టర్ సమత ప్రమాణ స్వీకారం చేయించారు. గ్రామపెద్దలు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలనే విక్రయించాలి

ఎర్రుపాలెం: డీలర్లు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులనే విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లోని షాపులతో పాటు సొసైటీలను ఆమె గురువారం ఏఓ కె.విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులలు, స్టాక్‌ను పరిశీలించిన డీఏఓ పలు సూచనలుచేశారు. ఈకార్యక్రమంలో ఏఈఓలు ధాత్రి, బాలకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ

సత్తుపల్లిరూరల్: అనంతపురానికి చెందిన తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి స్మారక చిత్రలేఖన పోటీల్లో సత్తుపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు పల్లం పిచ్చయ్య ద్వితీయ బహుమతి పొందారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఈ పోటీలలో పాల్గొనగా రాయలసీమ నేపథ్యాన్ని ఇతివృత్తంగా తీసుకొని పల్లం పిచ్చయ్య గీసిన చిత్రాన్ని ద్వితీయ బహుమతిగా ఎంపిక చేస్తూ రెండువేల రూపాయల నగదు, ప్రశంసాపత్రాన్ని నిర్వాహకులు తమ చిరునామాకు పంపారని తెలుపగా.. పలువురు అభినందనలు తెలిపారు.

సత్కారం

సత్తుపల్లి: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ పొలిటికల్ వింగ్ అధ్యక్షుడిగా ఎన్నికైన అలవాల కరుణాకర్‌ను గురువారం సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో ఘనంగా సత్కరించారు. గత 30 సంవత్సరాలుగా క్రిస్టియన్ సమాజానికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు జాన్ మార్క్, పింగళి సామేలు, పిల్లి రవికిరణ్, బాలరాజు, శ్రీనివాసరావు, యోబు, యోహాన్, విజయ్‌కుమార్, వరప్రసాద్, శ్యామ్‌సన్, ఏసుపాదం, సుధాకర్ పాల్గొన్నారు.

కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్
భద్రాద్రి కొత్తగూడెం కార్యాలయం

షార్ట్ టెండర్ నోటీస్

సంఖ్య : 667/లైబ్రరీ/SCA/2024 తేది : 07-03-2024

ఈ దిగువ సంతకందారుచే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం పట్టణంలోని కొత్త గ్రంథాలయమునకు అదనపు సౌకర్యాలు మరియు పుస్తకాలు సరఫరా పని కొరకు అర్హులైన టెండర్‌దారుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

దరావత్తు రూ॥ 50,000/- లు.

దరఖాస్తు తేది : 08-03-2024 ఉదయం గం॥ 10-30 ని॥ల నుండి తేది : 12-03-2024 మధ్యాహ్నం 2-00 గం॥ల వరకు కోరబడుచున్నవి.

దరఖాస్తు ధర : రూ॥ 5000/- లు.

దరఖాస్తులు జిల్లా పంచాయతీ రాజ్, కొత్తగూడెం కార్యాలయము (హెడ్ పోస్ట్ ఆఫీస్ దగ్గర, కొత్తగూడెం) వారి నుండి పొందవచ్చును.

టెండర్ సమర్పించుటకు చివరి తేది : 12-03-2024 మధ్యాహ్నం 2-00 గం॥లు. మరియు అదే రోజు సాయంత్రం 4-00 గం॥లకు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం వారి కార్యాలయములో తెరువబడును.

ఇతర వివరాలకు ఫోన్: 94418 38032, 96662 69199 నందు సంప్రదించగలరు

సం/-
కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్
భద్రాద్రి కొత్తగూడెం.

భద్రాద్రి కొత్తగూడెం
07-03-2024